# మిస్ శోభాదేవి

## పెనుమర్తి సూరి

"వచ్చావా శోభా! ఇందాకటి నుంచీ నీ కోసమే వెయిట్ చేస్తున్నా" అంటూ అప్పుడే లేడీస్ వెయిటింగ్ రూములోకి వస్తున్న శోభ దగ్గరకి వెళ్ళింది పార్వతి.

వెయిటింగ్ రూమంతా గరల్ స్టూడెంట్లతోటి హడావిడిగా ఉంది. ఫైనల్ బెల్‌కి ఇంకా పది నిమిషాలు టైముంది.

"ఏమిటోయ్ గిరాకీ! చాలా హుషారుగా ఉన్నావే! ఏమిటి విశేషం?" అక్కడే వున్న ఒక కుర్చీలో కూర్చుంటూ అడిగింది శోభ.

శకుంతలతో నీ తరఫున పది రూపాయలు పందెం వేశానోయ్."

"నా తరఫునా!"

"అదేనోయ్. రేపు సాయంత్రం టెన్నిస్ ఫైనల్సుగా. మీ అన్నయ్య గెలుస్తాడని నేను, ప్రసాద్ గెలుస్తాడని శకుంతల పదిరూపాయలు పందెం వేసుకున్నాం."

"చంపావ్‌పో. మా అన్నయ్య ఈ మధ్య సరిగా టచ్‌లో లేడు కదోయ్"

"అదేమిటోయ్ అట్లా అంటావ్. నీ మీద భరోసాతో నేను పందెం కాస్తేనూ!"

"నేను ముందరే చెప్పానోయ్ శోభా. మీ రామం అన్నయ్య గెలవ లేడని" వాళ్ళ దగ్గరికి వస్తూ అంది శకుంతల. "ప్రసాద్ ఇప్పుడు డెడ్లీ ఫారమ్‌లో ఉన్నాడు. అతన్ని ఎవ్వరూ గెలవలేరు. అది కాకుండా మీ బ్రదర్ ఈ మధ్య టచ్‌లో లేడుగదా!"

"అయితే నా పది రూపాయలకు నీళ్ళు ఒదులుకో వచ్చంటావా శోభా." నీరసంగా అడిగింది పార్వతి.

శకుంతల ఫక్కుమని నవ్వింది. "మహా చక్కగా వదులుకోవచ్చు. ప్రసాద్ తప్పకుండా గెలవడమే కాకుండా స్ట్రెయిట్ సెట్స్‌తో గెలుస్తాడు."

శోభకి ఎక్కడలేని పౌరుషం వచ్చింది. "నాన్సెన్స్! మా అన్నయ్యని మరీ అంత తేలిగ్గా తీసెయ్యకు. ఎంత టచ్‌లో లేకపోయినా ప్రసాద్‌ని కొట్ట కలడులే."

"నిజం!" ఎగిరిగంతేసింది పార్వతి. "నిజంగా గెలుస్తా డంటావా? అఫ్ కోర్స్ నువ్వన్నావంటే దానికి తిరుగు లేదనుకో...."

"ఏమిటే పార్వతీ! ఏమిటా తిరుగు

లేక పోవడం! "అప్పుడే రూములోకి అడుగు పెట్టిన రాధ అడిగింది.

వెంటనే శకుంతల అడిగింది. "నువ్వు చెప్పవోయ్ రాధా. రేపు టెన్నిస్ ఫైనల్స్‌గా. ప్రసాద్ గెలుస్తాడంటావా? రామం గెలుస్తాడంటావా?"

"ఇంకా అనుమానం దేనికీ. ప్రసాదే."

"నేనూ అదే అన్నాను. కాదు రామం గెలుస్తాడని నాతో పది రూపాయలు పందెం వేసింది పార్వతి."

"అయితే ఇంకాయేం! ఆ పది రూపాయలు వచ్చేసినట్లే లెక్క వేసుకో." నవ్వుతూ అంది రాధ.

శోభకి ఒళ్ళు మండింది. "పోనీ నువ్వుకూడా ఒక పది సంపాదింతువు గాని బెట్ కాయరాదూ?"

"తప్పకుండానూ. పది రూపాయలు వస్తూంటే ఒద్దంటానా! నీతోనే పందెం పది రూపాయలు. సరేనా?"

సరేనని ఒప్పుకుంది శోభ.


అక్కడే కూర్చున్న అమృత కూడా ప్రసాద్ గెలుస్తాడని పది రూపాయలు పందెం కాస్తానంది ఎవ్వరితోనైనా సరే. వెంటనే స్వర్ణ రామం గెలుస్తాడని ఆ పందానికి ఒప్పుకుంది. స్వర్ణకి అసలు టెన్నిస్ విషయం తెలియకపోయినా శోభ అంటే తగని నమ్మకం. ఆ విషయమే బైట పెట్టింది. 'శోభ ఎట్లా అంటే అట్లా అయితీర వలసిందే. శోభ వాళ్ళ అన్నయ్య గెలుస్తాడంది కాబట్టి అతనే గెల్చి తీరుతాడు."

చివ్వరికి ఈ పందాల్లోకి దాదాపు అక్కడున్న ఆడపిల్ల లందరూ దిగారు. కొంతమంది ప్రసాద్ గెలుస్తాడని పందెం వేశారు. శోభమీద నమ్మకంతో రామం గెలుస్తాడని కొంతమంది కాశారు. ఈ హడావిడిలో ఫైనల్ బెల్ అయేటప్పటికి ఒక్కరొక్కరే తమ తమ క్లాసులకి వెళ్ళడం మొదలెట్టారు. శోభా. పార్వతి కూడా లేచారు. పార్వతి తన క్లాసుకి పోతోతూ "శోభా పది రూపాయల సంగతి దేముడెరుగు. ఇప్పుడు ఇదొక 'ప్రిస్టేజి క్వశ్చన్' అయింది. మీ బ్రదరకి చెప్పు. ఎట్లాగేనా జాగ్రత్తగా ఆడి రేపు గెలిచేటట్లు చూడు. లేకపోతే మన పరువు పోతుంది" అంది.

"చూదాం కానీ" అంటూ శోభ కూడా తన క్లాసులోకి వెళ్ళింది.

ఆడపిల్లలు ఈ విధంగా పందాలు వేసుకున్నారన్న విషయం వైల్డ్ ఫైర్‌లా కాలేజీ అంతా వ్యాపించింది. వెంటనే మగ పిల్లలు కూడా పందాలు మొదలెట్టారు. ఉత్త కాపీ రాయుళ్ళాయెను. కొంతమంది రామం వైపు కొంతమంది ప్రసాద్ వైపు. పందాలు కాశారు. ఈ వార్త రామానికి, ప్రసాద్‌కి కూడా తెలిసింది. ప్రసాద్ విని నవ్వుకున్నాడు. రామానికి మాత్రం ఒళ్ళు మండింది. విచారించగా తెలిసింది ఈ పందాలు అనేవి అసలు శోభ వల్లనే మొదలైనాయని. శోభ మీద ఎంతేనా కోపం వచ్చింది.

సాయంత్రం ఇంటికి వెళ్ళి శోభను చూసేటప్పటికి ఆ కోపమంతా



కట్టలు తెంచుకుని బైటికొచ్చింది. "ఏమే శోభా! ఏమిటిది? నీకేం మతిపోయిందా! ఈ పందాలేమిటి? ఇదంతా నువ్వే మొదలెట్టావంటున్నారంతా. నీ కేమేనా బుర్ర ఉందా" అంటూ కేకలేయడం మొదలెట్టాడు.

శోభ నవ్వింది. "అదేమిట్రా! అట్లా అంటావ్? అవును నువ్వు గెలుస్తావని పందెం వేశాను. నా మీద నమ్మకంతో నా ఫ్రెండ్సు పందెం కాశారు. ఏం! కొంపతీసి ఓడిపోతావా ఏమిటి?"

"ఏడవలేక పోయావ్. నేనేమో ఈ మధ్య సరిగ్గా టచ్‌లో లేనాయెను. ప్రసాద్ బాగా ప్రాక్టీసులో ఉన్నాడు. నేనెట్లా గెలుస్తా ననుకున్నావ్?"

"నాన్సెన్స్. అయినా నువ్వే గెలుస్తావని నాకుంది. అసలు అదికాదు. నువ్వు ఎట్లాగేనా సరే, గెలిచి తీరాలి. ఇది ఇప్పుడొక ప్రిస్టేజి క్వశ్చన్ అయి కూర్చుందిరా! బాబ్బాబు!! ఎట్లాగేనా సరే రేపు నువ్వు గెలవాలి. లేకపోతే నా పరువు వుండదు." రామం గెడ్డం పుచ్చుకుని బతిమాలుతూ చెప్పింది శోభ.

"నీకు బుద్ధిలేదే అమ్మాయ్" అంటూ శోభ చెయ్యిని విసురుగా తోసేసి రాకెట్ పుచ్చుకుని క్లబ్‌కి వెళ్ళాడు ప్రాక్టిస్‌కోసం.

మరునాడు కాలేజీలో స్టూడెంట్లు ఎక్కువగా ఆ రోజు జరగబోయే టెన్నిస్ మ్యాచ్ గురించే మాట్లాడుకోడం మొదలెట్టారు. 'రామం పెద్ద ఆటగాడేకాని, టచ్‌లో లేడోయ్' అని కొందరు. ప్రసాద్ ప్లేలో పవర్ లేదని కొందరు. అయినా బేస్‌లైన్ ప్లేలో గట్టివాడని మరికొందరు. కాని రామానికి ఉన్న స్టామినా ప్రసాద్‌కి లేదని కొందరు. స్టామినా ప్రశ్నే లేదు. స్ట్రెయిట్ సెట్స్‌తో రామంమీద గెలుస్తాడని కొందరు — ఈ విధంగా ఎవరికి తోచినట్లు వాళ్ళు కామెంట్ చెయ్యడం మొదలెట్టారు. సాయంత్రం నాలుగ్గంట లెప్పు డవుతుందా అని కూర్చున్నా రంతా.

అంత ఆత్రంతో నిరీక్షించిన సాయంత్రం అవనే అయింది. చాలా మంది స్టూడెంట్లు టెన్నిస్ కోర్టుకి జేరుకున్నారు. శోభ, పార్వతి, శకుంతల, అమృత, స్వర్ణ మొదలైన చాలా మంది ఆడపిల్లలు కూడా అక్కడికి చేరుకున్నారు.

రామం, ప్రసాద్‌లు కోర్టులోకి వస్తున్నప్పుడు అందరూ కరతాళ ధ్వనులతో వాళ్ళని ఆహ్వానించారు. ప్రసాద్ అందర్నీ నవ్వుతూ విష్ చేశాడు. రామం మాత్రం అందరివంకా కోపంగా చూడ్డం మొదలెట్టాడు. ముఖ్యంగా శోభ వంక మరీ కోపంగా చూశాడు.

కొద్దిసేపట్లో ఆట ప్రారంభమయింది. కాని ఎంతో 'టెన్షన్' ఉంటుందనుకున్న ఆట చాలా పేలవంగా జరగటం మొదలెట్టింది. రామం ఆట మరీ అధ్వాన్నంగా ఉంది. అతని సర్వీస్‌లో

'పవర్' లేకపోడమే కాకుండా చాలా భాగం డబుల్ ఫాల్ట్సు అవుతున్నాయి. మొదటి సెట్టు ప్రసాద్ 6.0 తో గెలిచాడు. ఎంతగానో ఆశించిన ప్రేక్షకు లందరికీ చాలా ఆశాభంగం అయింది.

రెండో సెట్ మొదలయింది. కాని రామం ఆటలో మాత్రం మార్పు లేదు. 'డబుల్ ఫాల్ట్సు' మామూలు గానే ఉన్నాయి. 'రాలీస్' కూడా సరిగాలేవు. తేలిగ్గా తియ్యవలసిన బంతుల్ని కూడా మిస్ అవుతున్నాడు. బేస్‌లైన్‌పైపు బంతి వస్తే ఎత్తడానికి కూడా ప్రయత్నం చెయ్యడం లేదు.

శోభకి ఈ ఆట చూస్తూంటే ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లనిపిస్తున్నది. పార్వతి నెమ్మదిగా శోభచెవిలో అన్నది.

"ఏం శోభా! ఏమిటే ఈ ఆట! మీ వాడు అట్లా ఆడుతున్నాడేం? శకుంతల చెప్పినట్లు స్ట్రెయిట్ సెట్స్ తప్పదల్లే వుంది కనీసం ఒక సెట్టేనా గెలుస్తే బాగుణ్ణు. లేకపోతే మనం రిడిక్యులస్ అయిపోతాం."

శోభకి ఏం చెప్పాలో అర్థం కాలేదు. రామం ఆట చూస్తుంటే ఎక్కడలేని కోపం వస్తున్నది. కాని ఏం చెయ్యలేక అట్లానే చూస్తూ కూర్చుంది.

రెండోసెట్టు కూడా 6.1 స్కోరుతో ప్రసాదే గెల్చాడు. ప్రేక్షకు లందరూ ప్రసాద్‌ని మెచ్చుకోవడం మొదలెట్టారు.

"నేను చెప్పలా, స్ట్రెయిట్ సెట్స్ అని" నవ్వుతూ అంది శకుంతల. "ఒచ్చే సెట్ 6.0 తో గెలుస్తాడు చూడండి."

పాపం రామం వైపు పందెం కాసిన పార్వతి, స్వర్ణ మొదలైన వాళ్ళు తెల్ల ముఖం వేశారు. "మన పది రూపాయలకు నీళ్ళు ఒదులుకోవచ్చు" అని పైకే అనుకున్నారు.

శోభకి వీళ్ళ మాటలు వింటూంటే ఒళ్ళు ఉడుకెత్తిపోయి ఏడుపు పర్యంతం అయింది. ఒకసారి రామం వంక చూసింది. రామం అప్పుడే జగ్‌లో నీళ్ళు గ్లాసులో పోసుకుంటున్నాడు. శోభ కుర్చీలో నించి లేచింది. "ఏం శోభా! లేచావ్?" అని పార్వతి అంటున్నా వినిపించుకోకుండా, రామం దగ్గరికెళ్ళి 'ఫెడీ ఫెడీ' మని ఈ చెంపా ఆ చెంపా వాయించింది.

"ఇడియట్! ఫూల్! ఏం ఆటరా అది? నువ్వాడుతున్నది టెన్నిసా, లేక ఆడపిల్ల లాడుకునే చెమ్మచెక్కా? రాస్కెల్! అంత ఆడలేనివాడివి అసలు కోర్టులోకి ఎందుకొచ్చావ్? ఛీ! సిగ్గులేదూ నీకు" అంటూ తిట్టడం మొదలెట్టింది కోపంతో ఊగిపోతూ.

ప్రేక్షకు లందరూ ఈ హఠాత్పరిణామం చూసి ప్రాన్పడి పోయారు. రామం ఒక చేత్తో గ్లాసు, ఇంకో చేత్తో శోభ వాయించిన చెంప పుచ్చుకుని, శోభవంక ఇంతంత గుడ్లు చేసుకుని చూడ్డం మొదలెట్టాడు. కల్లో కూడా ఊహించి ఉండడు ఇల్లాంటి పరిణామం. నోటమాటలేక అట్లాగే శోభ వంక చూస్తూ ఉండిపోయాడు.

శోభ మాత్రం ఇంకా కోపంతో ఊగిపోతూనే వుంది. "ఛీ" నా పరువు తీసేస్తున్నావ్. ఇంటి దగ్గర అన్ని కబుర్లు చెప్తావ్. వింబుల్డన్ గెలుస్తా చూస్కో అంటావ్. లేవర్, ఇమర్సన్ నా ముందు బలాదూర్' అంటూ కూస్తావ్. ఈ ఆటతోనేనా నువ్వు వింబుల్డన్ గెలిచేది? సిగ్గులేదూ! నీ మీద నమ్మకంతో నేను పందెం వెయ్యడమే కాకుండా నువ్వు తప్పకుండా గెలుస్తావని నా ఫ్రెండ్స్‌ని కూడా పందెం కాయమన్నాను. ఛీ! ఛీ! తలెత్తుకోకుండా చేస్తున్నావ్. అంత ఆడలేకపోతే ఇంకా ఇక్కడెందుకూ? ఆ మూడో సెట్టు ఆడకుండానే ఒదిలేసి వెళ్ళిపోరాదూ! ఇంకా ఆ శ్రమ కూడా దేనికీ?"

ప్రేక్షకులందరూ కిమ్మనకుండా చూస్తూ కూర్చున్నారు ఆశ్చర్యంగా. రామం ఒకసారి చుట్టూ ఉన్న ప్రేక్షకులవైపు చూశాడు. అందరూ ఎంతో కుతూహలంగా చూస్తున్నారు రామం వంక. మళ్ళీ ఒకసారి శోభవంక చూశాడు. శోభ గుడ్లలో నిప్పులు కురిపిస్తున్నది.

అంతే. మంచినీళ్ళు త్రాగకుండానే ఆ గ్లాసుని నేలకేసి విసిరి కొట్టాడు. గ్లాసు పగిలిపోయి ముక్క ముక్కలైంది. తన రాకెట్‌ని తీసుకుని వెనక్కైనా చూడకుండా కోర్టులోకి వెళ్ళాడు. శోభ గబగబా వెళ్ళి మళ్ళీ తన సీట్లో కూర్చుంది.

మూడో సెట్టు ప్రారంభమయింది. కాని ఈసారి రామం ఆట ఇదివరకటికి మల్లే లేదు. ఏ ఒక్క బంతినీ మిస్ అవడంలేదు. సర్వీసులో ఒక్క డబుల్ ఫాల్టు కూడా ఉండటంలేదు. సర్వీస్ చేస్తూంటే ఆ బంతి 'ధన్' మని రాకెట్‌లా దిగుతున్నది. ప్రసాద్ దాన్ని ఎత్తలేక సతమతమవుతున్నాడు. ఒకవేళ ఎత్తినా మరుక్షణంలోనే రామం నెట్ దగ్గర ప్రత్యక్షమయి, పవర్‌ఫుల్‌గా హిట్ చేస్తున్నాడు. ప్రసాద్ నిస్సహాయంగా చూడ్డమే కాని ఏం చెయ్యలేకపోతున్నాడు. ఆ సెట్‌ని రామం 6-0 స్కోరుతో గెలిచాడు.

ఒక్కసారిగా ప్రేక్షకులందరూ గొల్లుమన్నారు. కరతాళ ధ్వనులు రెండు నిముషాల వరకు అట్లాగే వుండిపోయాయి. మొదట్లో ఆశించిన టెన్షన్, టెంపోలు ఇప్పుడొచ్చాయి. ప్రతివాళ్ళు రామాన్ని పొగడ్డం మొదలెట్టారు. పార్వతి సంతోషంలో గంతులేయడం మొదలెట్టింది. "శోభా! శోభా! మీ అన్నయ్య ఫారంలో పడ్డాడోయ్ అబ్బ! ఏం ఆడుతున్నాడోయ్! ఆ ప్రసాద్ మొఖంచూడు, ఎట్లా అయిపోయిందో! అబ్బ! టెరిబుల్!" అంటూ శోభభుజం పట్టుకుని ఊపడం మొదలెట్టింది.

మళ్ళీ ఆట ప్రారంభం అయింది. నాలవ సెట్టు. కాని రామం ఆట మాత్రం ఏ మాత్రమూ తగ్గలేదు. ప్రసాద్ బేస్‌లైన్ దగ్గరకి బంతిని కొడ్తూంటే, ముందరే ఊహించినట్లు రామం అక్కడ ప్రత్యక్షమవుతున్నాడు. కోర్టులో ప్రతిచోటా తనే ఉన్నట్లు ఆడుతున్నాడు. ప్రసాద్‌ని ఈ మూల

నించీ ఆ మూలకీ. ఆ మూలనుంచీ ఈ మూలకు చెడుగుడు ఆడిస్తున్నాడు తన ప్లేస్‌మెంట్స్‌తోటి. రామం సర్వీస్ చేసినప్పుడల్లా ప్రేక్షకులు గొల్లు మంటున్నారు ఎప్రీసియేషన్ తోటి. ఒక్క సర్వీసు కూడా మిస్ అవటం లేదు. సర్వీసు చేస్తే బంతి బులెట్‌లా దిగుతున్నది. ఆ సెట్‌ని రామం 6-1 స్కోరుతో గెలిచి స్కోర్‌ని ఈక్వల్ చేశాడు.

మళ్ళీ ప్రేక్షకులు గొల్లుమన్నారు. ఈసారి చప్పట్లు అయిదు నిముషాల వరకు ఆగలేదు. అందరూ రామాన్ని తెగ మెచ్చుకుంటున్నారు. పార్వతి సంతోషానికి ఇక హద్దేలేదు. ఉక్కిరి బిక్కిరై పోతోంది. "శోభా! మీ అన్నయ్య మన పరువు కాపాడాడోయ్. అబ్బ! ఏం ఆట! ట్రెమెండస్! ఏం: శకుంతలా! మాట్లాడవ్. స్ట్రెయిట్ సెట్స్ అన్నావ్‌గా. ఇప్పు డేమంటావ్? ఏయ్! స్వర్ణా! మన పది రూపాయలు పోలేదోయ్. పైగా మనకే పది రూపాయలు వచ్చేటట్లు న్నాయి. బలే బలే! మా శోభ ఆటంతా ఒక్కసారి తలక్రిందులు చేసేసింది...." ఇంకా ఏమిటేమిటో చెప్పేస్తోంది హుషారుగా.

రిఫరీ పది నిమిషాలు విశ్రాంతి పెముగా డిక్లేర్ చేశాడు. ప్రసాద్ తన కార్నర్‌కి వెళ్ళి ముఖం తుడుచు కుని ఒక గ్లాసు మంచినీళ్ళు తాగాడు. కాని రామం మాత్రం కోర్టులో నుంచి కదల్లేదు. అట్లాగే అక్కడే రాకెట్ పుచ్చుకుని నిలబడ్డాడు రొప్పుతూ.

చుట్టూరా ఇంత గందరగోళంగా వున్నా ఏమీ పట్టించుకున్నట్లు కనపడటం లేదు.

శోభ గబగబా వెళ్ళి జగ్‌లో నీళ్ళు గ్లాసులో పోసి తీసుకొచ్చి రామానికి ఇవ్వబోయింది. రామం ఇంకా కోపం గానే వున్నాడు. గ్లాసుని విసిరి అవతల పారేశాడు. శోభ ఆశ్చర్య పోతూ చూసింది. ప్రేక్షకులందరూ సభ్యులై రామాన్ని, శోభని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారు.

శోభ చాలా బాధ పడింది. రామానికి శోభ మీద కోపం కాస్తంత కూడా తగ్గ లేదు. 'నాకేం నీళ్ళా గీళ్ళా అందిం చాల్సిన పనిలేదు. పోయి నీ చోట్లో కూర్చో' అన్నాడు కోపంగా.

శోభ మళ్ళీ వెళ్ళి ఇంకో గ్లాసులో మంచినీళ్ళు పోసుకొచ్చింది.

"ఒరేయ్ ఎందుకురా అంత కోపం? నేను నీ చెల్లెల్ని కాదురా! నా మీదెందు కురా కోపం? నేనేం చేశాను? ఈ మంచి నీళ్ళు త్రాగరా. ప్లీజ్! లేకపోతే నేను చాలా బాధ పడ్తానురా. ప్లీజ్! అన్నయ్యా! నా తప్పేదైనా వుంటే క్షమించరా. నీ చెల్లెలిమీద అంత కోపం దేనికిరా? నువ్వే ఇంత కోపంచేస్తే ఇక నేనేమై పోతానురా!" నెమ్మదిగా బతి మాలడం మొదలెట్టింది ముఖం ఎంతో విచారంగా పెట్టి.

రామం ఒకసారి శోభ ముఖంలోకి చూశాడు. తను ప్రాణాల నైనా అర్పించే ఆ ముఖం విచారంగా వుండడం చూసి ఒక్కసారిగా నీరు కారిపోయాడు.

మాట్లాడకుండా గ్లాసు అందుకుని నీళ్ళు తాగడం మొదలెట్టాడు.

శోభ ముఖంలోకి సంతోషం వచ్చింది. "నాకు తెలుసు. మా అన్నయ్యకి నా మీద కోపం రాదని. ఒచ్చినా వెంటనే పోతుంది. మా అన్నయ్య చాలా మంచివాడు, నే నంటే ఎంతో ప్రేమ. కదురా అన్నయ్యా?" నవ్వుతూ అంది రామం ముఖంలో మార్పు గమనించి.

రామం ఒక్కసారి నవ్వాడు. గంటన్నర తరువాత నవ్వు ముఖం పెట్టింది ఇప్పుడే. ప్రేక్షకులు ఒక్కసారి చప్పట్లు కొట్టారు. రామం ఉలిక్కిపడి చుట్టూ చూశాడు. ఇంత వరకూ ఏ లోకంలో ఉన్నాడో, ఇప్పుడే ఈ లోకంలో పడ్డాడు. జరిగిందంతా ఒక్కసారి తలుచుకుని శోభవంక చూశాడు. శోభ నవ్వుతూ అక్కడే నిలబడింది, మనస్ఫూర్తిగా తను కూడా నవ్వాడు.

"దొంగపీనుగా! వేషాలు బాగా నేర్చావ్. నా చెంపలు రెండూ వాయించావు కదూ! ఇంటికి పద, నీ పని చెప్తా" నవ్వుతూ అన్నాడు గ్లాసు అందిస్తూ.

"ఏం చేస్తా వేమిటి? కొడ్తావా?" గ్లాసు అందుకుంటూ అంది నవ్వుతూ.

"కొడ్తావా అని ఇంకా నెమ్మదిగా అంటున్నావా? కాళ్ళు చేతులు విరిచేస్తాను. చూస్తూ ఉండు" తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నాడు రామం.

శోభ గలగలా నవ్వింది. "నువ్వేం కొట్టవు, నాకు తెలుసు. ఎందుకో చెప్పనా"

"ఏం! ఎందుకు?"

"అది రహస్యం. చెవి పట్టు, చెవిలో చెప్తాను" అంటూ రామం చెవిలో చెప్పింది. "నన్నెందుకు కొట్టనంటే, ఇవ్వాళ ఇంటి కెళ్ళిన తరవాత ఏం చెంపల్నయితే వాయించిందో ఆ చెంపల్ని నీ చెల్లెలు తన రెండు చేతుల్లోకి తీసుకుని వాటిమీద రెండు స్వీట్ కిసెస్ పెడ్తుంది. తెలిసిందా."

"ఆ! నిజంగా!" సంతోషంతో గట్టిగా అరిచాడు రామం.

"ఇష్!! ఏమిటల్లా గాడిదలా అరుస్తావ్. నిజంగానే చెప్తున్నాను!" నవ్వుతూ తిరిగి తన సీటుకి వెళ్ళి కూర్చుంది.

పార్వతి గబగబా ఒచ్చి శోభకి ఒక ముఖ్య విషయం నెమ్మదిగా చెప్పింది. "శోభా! ఈ ఫైనల్ సెట్ మీ వాడు ఏం చేస్తాడో, ప్రసాద్ చాలా ధైర్యంగా వున్నాడు. 'నేను కొంత కేర్లెస్‌గా ఆడడం వల్ల రెండు సెట్లు పోయాయి. మొదటి రెండు సెట్లు చాలా తేలిగ్గా గెలవడం వల్ల కేర్లెస్‌గాఆడాను. కాని ఫైనల్ సెట్ తప్పకుండా గెలుస్తాను. నా ప్రాణం ధారపోసేనా సరే, ఈ సెట్ రామాన్ని గెలవనీయను' అంటున్నాడు. ఈ సెట్‌ని కూడా మీ వాడు గెలిచాడంటే ఎంతో బాగుంటుంది."

వెంటనే శోభ 'అన్నయ్యా'! అంటూ కేకేసింది. ఏమిటన్నట్లు శోభ వైపు చూశాడు రామం.



"ఇందాక ఇస్తా నన్నానే. దానికి ఒక కండిషన్ ఉంది. అది అయితేనే ఇచ్చేది."

"ఏమిటది ?"

"ఈ సెట్ కూడా నువ్వే గెలవాలి. లేకపోతే ఇయ్యను. తెలిసిందా."

"ఆల్ రైట్. అట్లాగే గెలుస్తాలే"

"గెలుస్తాలే అంటే లాభంలేదు. గెల్చి తీరాలి. మిస్టర్ ప్రసాద్ కూడా తనే గెలుస్తానంటున్నాడట మరి"

రామం చిరునవ్వు నవ్వాడు. "ఆదేదో ఇస్తానని ఆశ పెట్టావుగా. దాని కోసమేనా ఈ సెట్ గెల్చి తీరుతాను. ప్రసాద్ కాదుకదా సాక్షాత్తూ ఆ వింబుల్డన్ ఛాంపియన్ రాయ్ ఇమర్సన్ వచ్చి ఆడినా ఈ సెట్ నా మీద గెలవలేడు, సరా ?"

శోభ తృప్తిగా నవ్వుకుంది. స్నేహితురాండ్రందరూ శోభని చుట్టు ముట్టారు, "ఏమిటోయ్ అది, ఏమిస్తా నన్నావ్. మాకు చెప్పవ్" అంటూ అడగడం మొదలెట్టారు. శోభ "అది సీక్రెట్. ఎవ్వరికీ చెప్ప కూడదు" అంది. పార్వతి కూడా రహస్యంగా అడిగి చూసింది తన కేనా చెప్పమని. కాని శోభ సమా ధానం మాత్రం అదే. "సీక్రెట్. చెప్ప కూడదు."

రిఫరీ విజిల్ వేశాడు, ఫైనల్ సెట్ మొదలుపెట్టే టైమయిందని. ప్రసాద్, రామం కోర్టులో ప్రవేశించి తమ తమ స్థానాల్లో నుంచున్నారు. రిఫరీ ఆటని ప్రారంభం చెయ్యబోతూ ప్రేక్షకుల్ని ఉద్దేశించి అన్నాడు "ఈ ఫైనల్ సెట్ చాలా ఇంట రెస్టింగ్‌గా ఉంటుంది. ఇద్దరూ పెద్ద ఆటగాళ్ళే. ఇద్దరూ మంచి పట్టులో ఉన్నారు ఈ సెట్ గెలవాలని. దయ చేసి ఎవ్వరూ రాలీస్ మధ్యలో గొడవ చెయ్యవద్దు. ఎంకరేజిమెంట్లు, కామెంట్లు ఒద్దు. అట్లా చేస్తే వాళ్ళకి కాన్సెన్ ట్రేషన్ పోతుంది. కాబట్టి గొడవ చెయ్యకండి" తరువాత రామంవైపు తిరిగి "సర్వీస్ నీది. కమాన్. స్టార్ట్" అన్నాడు.

ఫైనల్ సెట్ మొదలయింది. అను కున్నట్లే ఈ సెట్ చాలా ఇంట రెస్టింగ్గా ఉంది. రామం ఎంత గొప్పగా ఆడుతున్నాడో ప్రసాద్ కూడా అంత గొప్పగానూ ఆడుతున్నాడు. ప్రసాద్ సర్వీస్ స్వతహాగా వీక్‌గా ఉండేది. కాని ఈ సెట్‌లో ప్రసాద్ సర్వీసు కూడా పవర్‌ఫుల్‌గా ఉంది. రామం సర్వీసయితే స్వతహాగానే పవర్‌ఫుల్. ప్రతి పాయింటుకోసం ప్రాణాలు ధార పోసి ఆడుతున్నట్లు కనపడుతున్నారు. ప్రేక్షకు లందరూ మునికాళ్ళమీ దున్నట్లు కూర్చున్నారు. ఎవరు గెలు స్తారో చెప్పడం చాలా కష్టం అని పిస్తున్నది.

మొదలు పెట్టి నలభై నిముషా లయినా ఆట ఎటూ తెగటంలేదు. గేము సర్వీసు చేస్తున్నవాళ్ళకే ఒస్తున్నది. మొదటి గేము రామం గెలిచి స్కోరు 1-0 చేశాడు. ప్రసాద్ రెండో గేము గెలిచి స్కోరు 1-1 చేశాడు. మూడోది మళ్ళా రామం గెలిచి 2-1 చేశాడు. నాల్గోది ప్రసాద్ గెలిచి 2-2 చేశాడు. ఇట్లా సర్వీస్‌తో గేములు నడుస్తు న్నాయి. ఇట్లా నలభై నిముషాల తరు వాత స్కోరు 12-12 లో వుంది, ఇదరూ బాగా అలసిపోయారు. రామం కంటే ప్రసాద్‌కి స్టామినా తక్కువ కావడంవల్ల ప్రసాద్ రామంకంటె బాగా అలసి పోయాడు.


ఇరవై ఐదో గేము రామం సర్వీ సుది. రామం ఎంతో జాగ్రత్తగా ఆడుతూ రెండు డ్రాప్ షాట్స్, ఒక ప్లేస్‌మెంట్ తో ఆ గేము గెలిచి స్కోరును 13-12 చేశాడు.

ఇరవై ఆరో గేము మొదలెట్టారు. ఇది ప్రసాద్ సర్వీసుది. ఈ గేము గెలిచి సెట్ సంపాదించి ఛాంపియన్ షిప్ గెలవాలని రామం, ఈ గేము తను గెలిచి స్కోర్‌ని ఈక్వల్

చెయ్యాలని ప్రసాద్ దృఢ నిశ్చయా లతో ఆడుతున్నారు. సర్వీస్ ఎడ్వాం టేజి ప్రసాద్‌కి ఉన్నా రామం పట్టు దలతో ఆడుతూ మూడుసార్లు 'జ్యూస్' చేశాడు. రిఫరీ 'జ్యూస్' అన్నప్పు డల్లా ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ రామాన్ని మెచ్చుకుంటున్నారు. మూడో సారి జ్యూస్ అయిన వెంటనే రామం మొదటిసారిగా 'వాకౌట్' చెయ్య గలి గాడు. ఫైనల్‌గా రామం కోర్టులో వెనకాల ఉన్నాడు కదా అని ప్రసాద్ 'డ్రాప్' వేశాడు. కాని రామం సుడిగాలిలా నెట్ దగ్గరికి పరుగెత్తుకు వచ్చి తన శక్తినంతా ఉపయోగించి హిట్ చేశాడు. ఆ బంతి బౌండ్ పడి గాల్లోకి పదిహేను అడుగులు లేచి ప్రసాద్‌కి అందకుండా పైనుంచి వెళ్ళి పోయింది. ఆ గేము కూడా రామం అట్లా గెలిచి 14-12 స్కోరుతో ప్రసాద్‌ని ఓడించి ఛాంపియన్‌షిప్ గెలిచాడు.

ప్రేక్షకు లందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు. ప్రసాద్ కూడా సంతోషంతో నెట్ పైనుంచి దూక్కుంటూ ఒచ్చి రామాన్ని కావలించు కొని "కంగ్రాచ్యులేషన్స్. నీ ఆట అద్భుతం. యూ ఫుల్లీ డిజర్వ్ ది విన్" అన్నాడు. రామంకూడా 'నువ్వు మాత్రం తక్కువ ఆడావా ఏమిటి? ముప్పు తిప్పలు పెట్టావ్ నన్ను. ఈ సెట్ గెలిచేటంత వరకూ నమ్మకం లేక పోయింది' అన్నాడు నవ్వుతూ.

ప్రేక్షకు లందరూ వాళ్ళిద్దర్నీ చుట్టు ముట్టారు. ఇద్దరూ కూడా చాలా బాగా ఆడేరని మెచ్చుకోడం మొదలెట్టారు. శోభ సంతోషంతో గబగబా వచ్చి రామం చెయ్యి పుచ్చుకుని నిలబడింది. ప్రసాద్ శోభవంక చూసి నవ్వుతూ రామంతో అన్నాడు. "మిస్టర్ రామం!



నువ్వు ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి. ఇవ్వాళ నా మీద గెలిచింది నువ్వు కాదు. మీ సిస్టర్ మిస్ శోభా దేవి. ఆమే కనక ఇవ్వాళ ఇక్కడ లేకపోతే నువ్వు స్ట్రెయిట్ సెట్స్‌తో ఓడిపోయేవాడివి. ఆ విషయం మాత్రం నువ్వు ఒప్పుకోవాలి."

రామం తన చెయ్యి పుచ్చుకుని నిలబడ్డ శోభవంక చూశాడు. శోభ సిగ్గుతో తల దించుకుంది. "యు ఆర్ పర్ఫెక్ట్లీ కరెక్ట్ మిస్టర్ ప్రసాద్. ఈ గెలుపు మా శోభదే. ఐ ఎగ్రీ విత్ యూ" అన్నాడు నవ్వుతూ.

ప్రసాద్ మళ్ళీ అడిగాడు. "బై ది బై మిస్టర్ రామం. క్యూరియాసిటి వల్ల అడుగుతున్నాను. ఈ ఫైనల్ సెట్ నా శక్తినంతా ఉపయోగించి ఆడాను. నువ్వు గెలవగలవని ఎప్పుడూ అనుకోలేదు. నువ్వు గెలిచావంటే అర్థం నువ్వెంతో కాన్సెన్ట్రేట్ చేసి ఆడావన్నమాట. ఈ సెట్ నీ లైఫ్ అండ్ డెత్ అనుకుని ఆడావు. దానికి కారణం ఒక్కటే కనపడుతోంది. ఈ ఫైనల్ సెట్ నువ్వు గెలవకపోతే మీ సిస్టర్ నీకు ఇదివరకు ఇస్తానన్నదేదో ఇవ్వనన్నారు. నువ్వు దాన్నే మనసులో పెట్టుకుని ఆడావని నా ఉద్దేశం. అందుచేతే ఈ ఫైనల్ సెట్ గెలవ గలిగావు. మీ సిస్టర్ ఇస్తానన్న దేమిటో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉంది!"

చుట్టూరా ఉన్న ప్రేక్షకులు కూడా అదే అడిగారు. "అవునండీ, మిమ్మల్ని అంత గ్రేట్ షేకింగ్‌గా ఆడించిన ఆ వస్తువు, మీ సిస్టర్ ఇస్తానన్నది ఏమిటండీ? మా కు కూ డా చాలా కుతూహలంగా ఉంది తెలుసుకోవాలని. చెప్పండీ."

రామం నవ్వాడు. శోభని చూపిస్తూ "ఇస్తానన్నవాళ్ళు పక్కనే వున్నారుగా. దాన్నే అడగండి" అన్నాడు.

"ఏమండీ! మిస్ శోభాదేవీ! ఏమిస్తానన్నారండీ?" అంటూ శోభని అడగడం మొదలెట్టారు అందరూ.

శోభ బిత్తర పోయింది. తను ఇస్తానన్న దేమిటో తలపుకు ఒచ్చేటప్పటికి ఎక్కడలేని సిగ్గూ ఒచ్చింది. "అబ్బే!.. ఏం లేదండీ ....ఉత్తినే అన్నా .... అంతే...." అంటూ మాట మార్చబోయింది.

పక్కనే వున్న పార్వతి "నాకు తెలుసు ఏమిస్తానందో. నాకు చెప్పింది" అంది.

వెంటనే అందరూ పార్వతిని అడగడం మొదలెట్టారు. శోభ పార్వతి వంక కోపంగా చూసింది. పార్వతి నవ్వుతూ "ఆ ఏముంది! ఇంటికెళ్ళిన తరువాత ఇంకోసారి ఈ దవడా ఆదవడా వాయిస్తానంది. అవంటే వాళ్ళన్నయ్యకి చాలా ఇష్టమట," అంది.

అందరూ ఒక్క సారి నవ్వారు. ప్రసాదు, రామంతో సహా.

'ఛ!' అంటూ చెయ్యెత్తి, పారిపోతున్న పార్వతి వెంట పడింది మిస్ శోభాదేవి.

***